సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 3 । అక్టోబర్ । 2024



పేదల వైద్యంపై చిన్నచూపు

కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో సీఎం ఐఐ కేంద్రాల్లో అందిస్తున్న కంటి వైద్య సేవలను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది.

8లో ▸



అక్రమ నిర్మాణం అడ్డగింత

కూటమి నేతలు గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలను మరలా చేపడుతున్నారు. వీటిని అధికారులు అడ్డుకున్నారు.

8లో ▸



ఉత్సాహంగా క్రీడా పోటీలు

పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.

8లో ▸

దసరా శోభ.. ఉత్సవ ప్రభ

జయహో దుర్గాభవానీ

- శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం
- అమ్మవారి ఆలయాలు ముస్తాబు
- నేటి నుంచి విశేష అలంకరణలు

ద్వారకాతిరుమల/ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అయిగిరి నందిని.. నందితమేదిని.. విశ్వవినోదిని.. నందసుతే.. స్మరణలు మార్మోగనున్నాయి.. జగజ్జనని వేడుకలు అంబరాన్నంటనున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులకు సర్వం సిద్ధమైంది. గురువారం నుంచి ఈనెల 12 వరకు దసరా వేడుకలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీల ప్రతినిధులు, దేవదాయ శాఖ అధికారులు ఆలయాలకు నూతనంగా రంగులు వేయించి ఆలయ ప్రాంగణాల్లో చలువ పందిళ్లు వేయించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకునే సమయంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలు దశమి వరకు భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో విశేష పూజలు జరుగనున్నాయి. అమ్మవార్లకు రోజూ క్షీరాభిషేకాలు, బాలభోగ వినియోగాలు, శ్రీచక్ర అర్చనలు, కుంకుమార్చనలు, శ్రీ లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించనున్నారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవార్లకు రోజుకో ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగ సేవలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా ఆలయాల్లో శమీ పూజలు నిర్వహించనున్నారు.

శ్రీవారి క్షేత్రం ముస్తాబు :

దసరా ఉత్సవాలకు ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం, క్షేత్రదేవత కుంకుళ్లమ్మ ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయం, పరిసరాలను దేవస్థానం అధికారులు విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. గ్రామంలోని చిలుకూరి మహిళలు కుంకుళ్లమ్మవారిని తమ ఆడపడుచుగా భావించి ఏటా మాదిరిగా ఉత్సవాల ప్రారంభానికి ముందురోజు అయిన బుధవారం రాత్రి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు పూలు, పండ్లను సమర్పించారు. తొలిరోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.



ద్వారకాతిరుమలలో కాంతులీనుతున్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మ ఆలయం



భీమవరం మావుళ్లమ్మ తల్లి



ఏలూరు 12 పంపుల సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద పందిరి



ద్వారకాతిరుమలలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

ఆంధ్రా మైసూర్‌గా నూజివీడు

నూజివీడు: ఆంధ్రా మైసూర్‌గా పేర్గాంచిన నూజివీడులో దసరా సంబరాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. పట్టణంలోని పురాతన ఆలయం శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి 68వ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. పట్టణంలో ఇటు పొట్టిశ్రీరాములు బొమ్మ సెంటర్ వరకు, అటు పెద్దగాంధీబొమ్మ సెంటర్ వరకు రహదారికి ఇరువైపులా విద్యుద్దీపాలను అలంకరించారు. ఉత్సవాలలో భాగంగా అమ్మవారు తొలిరోజు బాలా త్రిపుర సుందరీదేవి, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపుర సుందరీదేవి, 7న మహాచండీదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దనీదేవి, 12న రాజరాజేశ్వరిదేవి అలంకరణల్లో దర్శనమివ్వనున్నారు. నవరాత్రి రోజుల్లో ప్రత్యేక కుంకుమ పూజలు చేయనున్నామని ఆలయ ఈఓ అలివేణి తెలిపారు. ఈనెల 6న ఉదయం 8 గంటల నుంచి ఆలయ ఆవరణలో శ్రీ చక్రనవావరణ సహిత చండీ హోమం, 9న మూలనక్షత్రం సందర్భంగా విద్యార్థులతో ఉదయం 10 గంటల నుంచి ఆలయ ఆవరణలో శ్రీ సరస్వతీదేవి పూజ, ఈనెల 12న విజయదశమి రోజున రాత్రి 8 గంటల నుంచి పోలీస్ అధికారులతో శమీపూజ నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 10 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు.



నూజివీడులో కోట మహిషమ్మ ఆలయం వద్ద విద్యుత్ వెలుగులు

కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రఘురాం

తాడేపల్లిగూడెం: కూటమి పాలన అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ప్రజలకు చేసిందేమి లేదని వైఎస్సార్ సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంటు వడ్డి రఘురాం నాయుడు ఎద్దేవా చేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ 100 రోజుల్లో కూటమి పాలన అర్థం కాని పరిస్థితిలో ఉందన్నారు. రైతే రాజు అని గౌరవించాల్సిన పరిస్థితి నుంచి టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి కుక్కలతోటి పోల్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రభుత్వానికి రైతు అంటే ఎంత గౌరవం ఉందో అర్థం అవుతుందన్నారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుంటే ఉద్యమిస్తామని రఘురాం హెచ్చరించారు. అకాల వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకొనేందుకు పూర్తిస్థాయిలో కృషి చేయాలని, రాష్ట్రంలో రైతులకు సాయంగా ఉండటానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమీక్షలో చెప్పారన్నారు. ఈ మేరకు ముందుకు వెళతామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు. ఎంపీపీ పొను కుమాటి శేషులత, పట్టణ అధ్యక్షుడు గుండు బోగుల నాగు, పార్టీ నాయకులు గొర్రెల శ్రీనివాసు, మర్లపూడి సుబ్బారావు, నార్ని నాగు, మాకరాజు సతీష్, దారపురెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు. రఘురాంను ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు.

అధినేత వైఎస్ జగన్‌తో భేటీ

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వడ్డి రఘురాంనాయుడు బుధవారం తాడేపల్లిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్‌రీల్

మద్యం పాలసీపై మండిపాటు



నూతన మద్యం పాలసీని రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్న ఐద్వా నాయకులు

ఆకివీడు: కూటమి ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీపై ఐద్వా సంఘ సభ్యులు మండిపడ్డారు. మద్యం పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ఐద్వా సంఘ కార్యాలయం వద్ద సంఘ సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి సందక ఉదయకుమారి మాట్లాడుతూ బ్రాందీ షాపుల్ని అధికంగా పెంచి, మద్యాన్ని ఏరులైపారే విధానాన్ని ప్రభుత్వం అవలంభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్య, వైద్యం, ఉపాధిపై దృష్టి పెట్టకుండా మద్యం ఆదాయాన్ని వనరులుగా ప్రభుత్వం చూపించుకోవడం సిగ్గుచేటన్నారు. అఖిల పక్షంతో సమావేశం ఏర్పాటు చేసి మద్యం పాలసీపై నిర్ణయం తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు దోకల లక్ష్మి, ఎర్రా కృష్ణవేణి, బీ కృష్ణవేణి, జీవీ లావణ్య, రమణ, లక్ష్మి పాల్గొన్నారు.

రెండో రోజుకు నిరాహార దీక్షలు



కేంద్ర వైఖరిని నిరసిస్తూ దీక్షలు నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక వసంత మహల్ సెంటర్ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద చేపట్టిన నిరాహారదీక్షలు బుధవారం రెండోరోజు కొనసాగాయి. దీక్షల్లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీఎన్‌వీడీ ప్రసాద్, కె.బుచ్చిబాబు, బి.వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు కె.కృష్ణమాచార్యులు, ఇఫ్టూ నేత రాంబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్టీల్ ప్లాంట్‌ని సందర్శించిన కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ 45 రోజుల్లోనే స్టీల్ ప్లాంట్‌ను రక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని, ప్రధాని మోదీని ఒప్పించి స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపడానికి హామీ ఇచ్చారన్నారు. నేటికి రెండు నెలలు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా నాశనం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన



భోగోలులో సర్పంచ్ లేకుండానే గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం


లింగపాలెం: భోగోలు పంచాయతీలో బుధవారం నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. గాంధీ జయంతి సందర్భంగా గ్రామంలో గ్రామసభ నిర్వహించాల్సి ఉంది. అయితే సర్పంచ్ లేకుండా కార్యదర్శి కె.ఈశ్వరి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో గ్రామసభ నిర్వహించి ప్రొటోకాల్ ఉల్లంఘించారు. ఒక దళిత సర్పంచిని ఈవిధంగా అవమానపరిచినందుకుగాను కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తానని సర్పంచ్ శాంతారావు తెలిపారు.

ఆకివీడులో చోరీ

4 కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల అపహరణ

ఆకివీడు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆకివీడులోని సాలిపేటలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. సాలిపేటలోని ఒక అద్దె ఇంట్లో బత్తుల వనజాక్షి నివసిస్తున్నారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులో ప్రభుత్వం ఇళ్ల స్థలం ఇవ్వగా అక్కడ ఇల్లు నిర్మించుకున్నారు. ఈ నెల 1వ తేదీ మధ్యాహ్నం సాలిపేటలోని అద్దె ఇంటికి తాళం వేసి తాళ్లకోడులోని సొంత ఇంటికి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి, తలుపు తెరిచి ఉండటం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని 4 కాసుల బంగారు ఆభరణాలు, 54 తులాల వెండి వస్తువులు, కొంత డబ్బు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై హనుమంతు నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

నరసాపురం: గాంధీజీ ఆశయాల సాధన దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం గాంధీ జయంతి వేడుకను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి ముదునూరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించడం ద్వారా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పాలన చేరువ చేశారన్నారు. మహాత్ముడు చెప్పిన గ్రామ స్వరాజ్యాన్ని సాధించే దిశగా గత ప్రభుత్వం కృషి చేసిందన్నారు. పార్టీ కేంద్రపాలక మండలి సభ్యుడు పీడీ రాజు, మునిసిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఎంపీపీ మైలాబత్తుల సోనీ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): మహాత్మా గాంధీజీ మార్గం అనుసరణీయమని, నేటి యువత ఆయన స్ఫూర్తితో ముందడుగు వేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ జయంతిని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా పాటించే సంప్రదాయం 2007 సంవత్సరం నుంచి ప్రారంభమైందన్నారు. ప్రతిఒక్కరూ ఆ మహానుభావుల త్యాగాలను గుర్తుంచుకుని సరైన మార్గంలో దేశాన్ని ముందుకు నడిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నోడల్ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.నాగేశ్వరరావు, తహసీల్దార్ రావి రాంబాబు, పంచాయతీరాజ్ డీఈలు పి.శ్రీనివాసరాజు, జీవీఎస్‌ఎన్ స్వామినాయుడు, వీఆర్వో ఏ.చైతన్య, వెల్ఫేర్ సెక్రెటరీ ఎస్.దుర్గాభవాని, ప్లానింగ్ సెక్రటరీ ఎం.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

గ్రామ స్వరాజ్యానికి పాటుపడాలి : బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి మనమంతా నిరంతరం పాటుపడాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని బాపూజీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

సత్యం, అహింసలే ఆయుధాలుగా..

భీమవరం: మహాత్మాగాంధీ ఆదర్శాలను అనుసరిస్తూ ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. బుధవారం మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ సత్యం, అహింసలే ఆయుధాలుగా గాంధీజీ భారత స్వరాజ్య సంగ్రామ చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికారని, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ లాంటి ఉద్యమాలలో యావత్ దేశ ప్రజలలో స్వరాజ్య స్ఫూర్తిని రగిలించారని కొనియాడారు.



గాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

నేటితరం గాంధీజీ సిద్ధాంతాలు తెలుసుకోవాలి

నిడమర్రు: నేటితరం యువత మహాత్మాగాంధీ సిద్ధాంతాలు తెలుసుకుని భవిష్యత్ తరాలకు అందించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర గాంధీ స్మారక నిధి చైర్మన్ కాజా పూర్ణచంద్ర గాంధీ అన్నారు. బుధవారం పెదనింద్రకొలను మహాత్మా గాంధీ భవనంలో జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలు జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పూర్ణ చంద్రగాంధీ గాంధీజీ మార్గదర్శకాలు వివరించారు. జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం గాంధేయ వాదులుగా ఉన్న కె.సర్వేశ్వరరావు, బంగార్రాజులను సర్వోదయ మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం గాంధీ భవనంలో ఆక్రమణలో ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించారు. జిల్లా సర్వోదయ మండల చైర్మన్ ఇందుకూరి ప్రసాదరాజు, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చ నాయకురాలు శరణాల మాలతీ రాణి, రుద్రరాజు ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్‌వీఎస్ రాజు, మానవత జిల్లా నాయకులు సాగిరాజు జానకిరామరాజు ఉన్నారు.



పెదనింద్రకొలను గాంధీ భవనంలో మహాత్ముడికి నివాళులర్పిస్తున్న సర్వోదయ నేతలు, విద్యార్థులు

6న చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

భీమవరం: రాష్ట్రస్థాయి అండర్–15 చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఈనెల 6వ తేదీన భీమవరం పట్టణంలోని అనసూయ చెస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9వ తేదీ నుంచి మూడు రోజులపాటు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాల కోసం సెల్: 90632 24466 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



తణుకు బాల సదన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా నాల్గో అదనపు జడ్జి సత్యవతి

తణుకు టౌన్: విద్యార్థులకు అందించే మంచినీరు, ఆహార పదార్థాలు నాణ్యమైనవి ఉండాలని తణుకు మండల న్యాయ సేవా సంస్థల చైర్మన్, తణుకు నాల్గో జిల్లా అదనపు జడ్జి డి సత్యవతి ఆదేశించారు. బుధవారం ఆమె తణుకులోని బాల సదన్ చిల్డ్రన్ హోం, గుడ్ సమరిటన్ చిల్డ్రన్ హోం, ప్రభుత్వ బాలుర వసతి గృహం, పాలంగిలోని ప్రేమాన్విత మానసిక వికలాంగుల పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల భవనాలకు సంబంధించిన వంట గది, మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా, స్నానాల గదులను పరిశీలించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీఎన్‌వీ రంజిత్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉద్యమంలా ‘స్వచ్ఛతా హీ’

భీమవరం (ప్రకాశంచౌక్): దేశ పౌరులంతా స్వచ్ఛతా కార్యక్రమాలను ఒక ఉద్యమంలా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. సెప్టెంబర్ 17 నుంచి నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ కార్యక్రమాల ముగింపు ఉత్సవాలను బుధవారం భీమవరం మునిసిపల్ కార్యాలయం ఆవరణంలో అట్టహాసంగా నిర్వహించారు. తొలుత గాంధీ జయంతిని పురస్కరించుకొని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, కలెక్టర్, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గం, ఉద్యమాలు చేసినటువంటి శాంతి దూత జాతిపిత మహాత్మాగాంధీ అని అన్నారు. అలాగే మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, చింతలపాటి బాపిరాజు జయంతి సందర్భంగా నివాళులు అర్పించడం మన కనీస బాధ్యతని అన్నారు. మన ఇంటిని, పరిసరాల శుభ్రత విషయంలో మనమే బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో విశేష సేవలు అందించిన సఫాయి మిత్రులకు, ఎన్‌జీఓలు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలను సత్కరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కనుమూరి రఘురామ కృష్ణరాజు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఫారెస్ట్ అధికారులపై దాడి


పోలీసుల వాహనాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

లింగపాలెం: మండంలోని కలరాయనిగూడెం అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి అటవీ భూమిని ట్రాక్టర్‌తో దున్నుతుండగా అడ్డుకోవడానికి వెళ్లిన ఫారెస్ట్ ప్రొటెక్షన్ హెల్పర్స్ (బేస్ క్యాంప్ సిబ్బంది) నలుగురిపై కలరాయనగూడెం గ్రామస్తులు దాడి చేశారు. ఘటనా స్థలానికి వెళ్లిన చింతలపూడి సీఐ రవీంద్ర వాహనాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన వ్యాను


బాధితుడిని 108 వాహనంపై తీసుకు వెళ్తున్న దృశ్యం

మండవల్లి: కాల్వలోకి వ్యాను దూసుకెళ్లి లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామవరప్పాడు బల్లివారి వీధికి చెందిన విన్నకోట రవి మంగళవారం రాత్రి భీమవరం నుంచి లారీ విడి భాగాలు (స్క్రబ్)తో విజయవాడకు వెళుతున్నాడు. రాత్రి 9.30 గంటల సమయంలో మండవల్లి మండలంలోని పెరికెగూడెం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న కెనాల్‌లోకి వ్యాన్ దూసుకెళ్లింది. వ్యాను క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోయి హాహాకారాలు చేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రామచంద్రరావు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో బాధితుడిని బయటకు తీశారు. 108 వాహనంలో క్షతగాత్రుడిని గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి : పెదవేగి నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చాన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని పేర్కొన్నారు.

శ్రీవారి ఆలయంలో రామ ధనుస్సుకు పూజలు


శ్రీనివాస శాస్త్రికి శ్రీవారి జ్ఞాపికను అందిస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల : అయోధ్యకు తీసుకెళుతున్న రామ ధనుస్సుకు శ్రీవారి సన్నిధిలో బుధవారం రాత్రి పూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ నిర్వాహకులు చల్లా శ్రీనివాస శాస్త్రి అయోధ్య తీసుకెళ్తున్న రామ ధనుస్సుతో చినవెంకన్న క్షేత్రానికి విచ్చేశారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి, ధనుస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యంలు ఆయనకు శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ కేజీ బంగారం, 13 కేజీల వెండితో తయారు చేసిన ధనుస్సు, బాణాన్ని అయోధ్యలో రాముల వారికి సమర్పించేందుకు తీసుకెళ్తున్నట్టు తెలిపారు.

పేదల వైద్యంపై చిన్నచూపు

- సీఎం ఐఐ కేంద్రాల్లో నిలిచిన సేవలు
- పేద, మధ్య తరగతి ప్రజలకు అందని కంటి వైద్యం
- ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న ఆప్తామాలజీ అసిస్టెంట్ విజయ్‌భాస్కర్ (ఫైల్)

దెందులూరు: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ప్రతి మనిషికీ కళ్లు అత్యంత ప్రధానమైనవి. పేద, మధ్య తరగతి, గిరిజన ప్రాంత ప్రజలు కంటి సమస్యలకు మెరుగైన వైద్యం అందించేందుకు, కళ్లజోళ్ల పంపిణీ, ఆపరేషన్లు చేయించేందుకు ప్రభుత్వ వైద్యశాలల్లో ముఖ్యమంత్రి ఐఐ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఐదేళ్ల పాటు ఈ కేంద్రాల్లో పేదలకు కంటి వైద్య సేవలు అందించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కొనసాగుతున్న సీఎం ఐఐ కేంద్రాల్లో సేవలను టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే నిలిచిపోయాయి. గత నెల (సెప్టెంబర్) 5వ తేదీ నుంచి కంటి వైద్య పరీక్షలను ఆపేశారు. దీంతో వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు ఆసుపత్రిల్లో కంటి వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సీహెచ్‌సీలో ఒక ఆప్తామాలజీ అసిస్టెంట్, ఒక ఎక్యూప్‌మెంట్ టెస్ట్ ఉండేవారు. ఆటో నిస్రాక్టో మీటర్, ఫండస్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఓపీ సంఖ్య వందకుపైనే పెరిగింది. ప్రజలంతా కంటి సంబంధించి వైద్యానికి ప్రభుత్వ వైద్యశాలలపైనే ఆధారపడ్డారు. తమ కంటి సంబంధిత సమస్యలను పరిష్కరించుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో సీఎం ఐఐ కేంద్రాల్లో నిర్వహించిన సేవలు	
సీహెచ్‌సీలు	: 12
సిబ్బంది	: 24 మంది
ఐదేళ్లలో నిర్వహించిన కంటి వైద్య పరీక్షలు	: 1,87,375
మంజూరు చేసిన కళ్ల అద్దాలు	: 77,745
కంటి శస్త్ర చికిత్సలు	: 5,678

ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూపు



ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. సీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున కంటి వైద్య సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే ఆదేశాలకు అనుగుణంగా కంటివైద్య సేవలను ప్రారంభిస్తాం. ప్రతిరోజూ సీహెచ్‌సీలకు చాలామంది వచ్చి కంటి వైద్యం, కళ్లజోళ్ల గురించి అడిగి వెళుతున్నారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి కంటి వైద్యానికి సంబంధించి ఆదేశాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– రాజ్‌కుమార్, కంటి వైద్య జిల్లా అధికారి

కంటి పరీక్షలు ప్రారంభించాలి



సీహెచ్‌సీల్లో వెంటనే కంటివైద్య పరీక్షలు ప్రారంభించాలి. లేదంటే పేదలందరిపైనా ఆర్థిక బారం పడుతుంది. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రైవేటు వైద్యం జోలికి వెళ్లనీకుండా పేదలకు ప్రభుత్వ వైద్యశాలల్లో పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలతో కూడిన కంటి వైద్యం అందించారు. బాధితులంతా ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

– మద్దా భూషణం, రామారావుగూడెం గ్రామస్తుడు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ఎస్సార్ బంక్ సమీపంలో బోల్తాపడిన వ్యాను

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎస్సార్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్టు ఎస్సై జబీర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యనగూడెంకు చెందిన కొండపల్లి వెంకటేష్, జోగి రాఘవులు కూలీ పని చేసుకుని జీవిస్తున్నారు. బుధవారం ఉదయం కూలి పని నిమిత్తం వారు ఆటోలో వెళుతుండగా స్థానిక ఎస్సార్ బంక్ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లోడు వ్యాన్ ఎదురుగా ఉన్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి బోల్తా పడింది. వ్యాన్ జారుకుంటూ ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ క్రమంలో ఆటో వెనుక కూర్చొని ఉన్న వెంకటేష్, రాఘవులకు గాయాలయ్యాయి. వీరిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. వెంకటేష్, రాఘవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బ్లడ్ బ్యాంకు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి


బ్లడ్ బ్యాంకు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బ్లడ్ బ్యాంకు త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం మండలం రాయలంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయం, బ్లడ్ బ్యాంకు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ సహకారంతో సమకూర్చుకున్న రూ.2 కోట్ల విలువైన యంత్రాలు, పరికరాలు, మౌలిక సదుపాయాలను కలెక్టరు పరిశీలించారు. నేషనల్ సెంట్రల్ డ్రగ్ అధారిటీ న్యూఢిల్లీ వారి నుంచి బ్లడ్ కేంద్రం ఏర్పాటుకు లైసెన్స్ మంజూరైనట్టు కలెక్టరుకు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రక్త దాతలను ప్రోత్సహించి, రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సాధ్యమైనంత తొందరలో బ్లడ్ బ్యాంకు కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రావి రాంబాబు, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ ఎం శివరామ భద్రిరాజు, కోశాధికారి కె.తిరుపతి రాజు, ఎంసీ సభ్యులు కె.రఘు సీతారామ కృష్ణంరాజు, సీహెచ్‌వీ ఫణి, కె.రామకృష్ణంరాజు, సీనియర్ కో ఆర్డినేటర్ ఎస్ మల్లేశ్వర రావు, సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి కృష్ణారావు, రెడ్ క్రాస్ సంస్థ సిబ్బంది, తదితరులు వున్నారు.

గరగపర్రులో అలజడి

శ్మశాన స్థలం ఆక్రమణ, ఇరువర్గాల వాగ్వాదం


టెంట్ వద్ద ఇరువర్గాల వారితో చర్చిస్తున్న పోలీసులు

పాలకోడేరు: పాలకోడేరు మండలం గరగపర్రులో ఉన్నట్టుండి బుధవారం పెను అలజడి రేగింది. గ్రామంలోని సర్వే నెంబర్ 384/2లో సుమారు నాలుగు ఎకరాల 58 సెంట్ల శ్మశాన వాటిక ఉంది. ఇది కొంతమేర ఆక్రమణకు గురైంది. ఆక్రమణకు గురైన ప్రాంతంలో కొందరు పక్కా భవనాలు నిర్మించుకుని జీవిస్తున్నారు. మిగిలిన ఖాళీ భూమిని స్వాధీనం చేసుకునేందుకు గ్రామంలోని ఎస్సీలు బుధవారం జేసీబీతో చదును చేయిస్తుండగా స్థలాలు తమవంటే తమవంటూ ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది. భీమవరం – తాడేపల్లిగూడెం రహదారిపై గరగపర్రు కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో అలజడి రేగింది. కొందరు ముస్లింలు గరగపర్రు మసీదు సమీపంలో టెంట్ వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రహదారిపై కిలో మీటర్ల మేర వాహనాలు సుమారు రెండున్నర గంటలకుపైగా నిలిచిపోయాయి. బస్సుల్లోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో సమాచారం అందుకున్న భీమవరం సీఐలు శ్రీనివాసరావు, కాళీ చరణ్ పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారినీ సముదాయించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమమం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శ్మశాన వాటిక స్థలాల్లో భవనాలు నిర్మించుకున్న నివాసం ఉంటున్న వారిని ఇబ్బంది పెట్టకుండా ఖాళీగా ఉన్న శ్మశాన భూముల్లో శ్మశానానికి వెళ్లేందుకు రహదారుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎస్సీలు కోరారు. దీనిపై ఆర్ఐ కలిదిండి రాఘవరాజు మాట్లాడుతూ ఈ విషయాన్ని తహసీల్దార్‌తో చర్చించి భూమిని సర్వే చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో వివాద సర్దుమణిగింది.

నూతన మద్యం పాలసీ రద్దుకు డిమాండ్


సమావేశంలో పాల్గొన్న ఐద్వా జిల్లా నాయకులు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని, ప్రజల నివాసాల వద్ద మద్యం షాపులు పెట్టవద్దని సీపీఎం జిల్లా మహిళా శాఖ మహాసభ డిమాండ్ చేసింది. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మహిళా శాఖ మహాసభ జె.హరీషా దుర్గ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సభలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన మొత్తం మద్యం పాలసీ ప్రజలను మరింత మద్యం తాగించే విధంగా ఉందని ఆరోపించారు. మద్యాన్ని ఆదాయ వనరుగా చూడొద్దని, షాపులను ప్రభుత్వమే నడపాలని కోరారు. ప్రతి నెలా మద్యం డ్రై డేస్ అమలు చేయాలన్నారు. ఏలూరు నగరంలో ఇటీవల కాలంలో మహిళలు చిన్నారులపై అత్యాచారాలు లైంగిక దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా ఒక ప్రైవేటు వసతి గృహంలో బాలికలపై లైంగిక దాడులు జరగడమే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. ఇటువంటి ఘటనలపై ప్రభుత్వం అధికారులు వెంటనే జోక్యం చేసుకొని దోషులకు సత్వరమే కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు విచారించడానికి ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శాఖ కార్యదర్శి సీహెచ్ రాజ్యలక్ష్మి ప్రవేశపెట్టిన గత కార్యకలాపాల నివేదికపై సభ్యులు మాట్లాడారు. ఏలూరు నగరంలో పలు ప్రజా సమస్యలపై ఆందోళనలో చేపట్టాలని మహాసభ తీర్మానాలు ఆమోదించింది. సీనియర్ నాయకులు చింతాడ వెంకటలక్ష్మి, సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎం అరుణకుమారి, నాయకులు జి శారద తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

- ఆర్‌అండ్‌బీ స్థలంలో యథేచ్ఛగా నిర్మాణం
- కూటమి నేత ఆక్రమణ పర్వం
- రెండోసారి అడ్డుకున్న అధికారులు


దెయ్యంపాడు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి స్థలంలో అక్రమ నిర్మాణం


పనులను నిలుపుదల చేయిస్తున్న వీఆర్వో యువరాజు, ఆర్‌అండ్‌బీ సిబ్బంది

కైకలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలుపుదల చేసిన అక్రమ నిర్మాణాలను గుట్టుచప్పుడు కాకుండా మరలా చేపడుతున్నారు. రాత్రీపగలూ తేడా లేకుండా పనులు చేపడుతుండగా.. అధికారులు మరోమారు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా మండవల్లి మండలం చింతపాడు గ్రామ శివారు దెయ్యంపాడు వద్ద ఎంకే అనే వ్యక్తి సోదరుడి భవనం ఉంది. ఎదురుగా ఆర్‌అండ్‌బీ రహదారికి చెందిన దాదాపు నాలుగు సెంట్ల స్థలంలో ఎంకే దుకాణాల అక్రమ నిర్మాణం చేపట్టగా ఈ ఏడాది మార్చిలో అధికారులు నోటీసులు ఇవ్వడంతో పాటు పొక్లెయిన్‌తో కొంత మేర ధ్వంసం కూడా చేశారు. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మరలా ఇప్పుడు ఆక్రమణదారుడు పనులు చేపట్టడంతో బుధవారం వీఆర్వో యువరాజు, ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీను నిర్మాణాన్ని అడ్డుకున్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం

అర్‌అండ్‌బీ స్థలంలో నిర్మాణాలపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో ఆక్రమణదారుడికి నోటీసులు ఇచ్చి కొంతమేర కూల్చివేశామని వీఆర్వో యువరాజు చెప్పారు. ఇప్పుడు తిరిగి నిర్మాణాలు కూలీలతో చేపడుతున్నాడని ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో తహసీల్దార్ ఆదేశాలతో నిర్మాణాలను అడ్డుకున్నామని చెప్పారు. అక్రమ నిర్మాణాలను త్వరలో కూల్చివేస్తామని వీఆర్వో తెలిపారు.

కూటమి ప్రభుత్వం అండతో..

ఆక్రమణదారుడు కూటమి నేతలతో సాన్నిహిత్యం పెంచుకోవడంతో పాటు ఇటీవల వరదల సమయంలో కూడా నాయకుల దృష్టిని ఆకర్షించారు. అలాగే టీడీపీ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదే అదనుగా అక్రమ కట్టడాన్ని తిరిగి ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ రహదారికి చెందిన స్థలాలు కొందరికి లీజుకు ఇచ్చినట్టు ఆరోపణలు కూడా ఉన్నాయి. మూడు రోజులుగా తిరిగి అక్రమ నిర్మాణ పనులు చేపట్టడంతో అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు, జిల్లా కోశాధికారి సీహెచ్ పట్టాభిరామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం యూటీఎఫ్ సత్యాగ్రహ దీక్షల్లో వారు మాట్లాడారు. జీపీఎఫ్ అకౌంట్లు ప్రారంభించాలని, పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, తక్షణం బదిలీలు, ప్రమోషన్స్ చేపట్టాలని కోరారు. తొలుత గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో భీమవరం టౌన్ శాఖ ప్రధాన కార్యదర్శి కేవీ మల్లేశ్వరరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.అబ్రహం, బి.నాగబాబు, కె.త్రిమూర్తులు, మల్లుల శ్రీనివాస్, కొల్లాటి సత్యనారాయణ, ఎం శివరామరాజు, వి.సత్యస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

పాల ట్యాంకర్, లారీ ఢీ

ట్యాంకర్ డ్రైవర్ మృతి


దేవరగుంట వద్ద ఎదురెదురుగా ఢీకొన్న లారీ, పాల ట్యాంకర్లు

నూజివీడు : హెరిటేజ్ మిల్క్ ట్యాంకర్, లారీ ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందగా, మరో వ్యక్తికి కాలు విరిగింది. ఈ ఘటన నూజివీడు మండలం దేవరగుంట అడ్డరోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఉదయం 7.30 గంటల సమయంలో మిల్క్ ట్యాంకర్ నూజివీడు వైపు, లారీ హనుమాన్ జంక్షన్ వైపు వెళ్తూ రెండూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ట్యాంకర్ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ట్యాంకర్ డ్రైవర్ కోడూరు విశ్వేశ్వరరావు (50) తీవ్రంగా గాయపడటంతో హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విశ్వేశ్వరరావు మృతిచెందారు. విశ్వేశ్వరరావుది కృష్ణా జిల్లా పామర్రు మండలం ప్రాకర్ల స్వగ్రామం. ట్యాంకర్, లారీ ఢీకొన్న సమయంలోనే వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనదారుడు తేళ్లూరి వెంకటేశ్వరరావు (39) లారీని ఢీకొట్టాడు. దీంతో వెంకటేశ్వరరావుకు కాలు విరిగింది. క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన తరువాత మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతనిది పామర్రు స్వగ్రామం కాగా నూజివీడు వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. లారీ డ్రైవర్ ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి బైటపడ్డాడు. రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రీడలు విద్యార్థుల జీవితంలో అంతర్భాగం కావాలి


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీవీఈఓ ప్రభాకరరావు

పెదవేగి : క్రీడలు ప్రతి విద్యార్థి జీవితంలోనూ అంతర్భాగం కావాలని డీవైఈఓ ఎం ప్రభాకరరావు అన్నారు. పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 19 ఏళ్ల విభాగం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను డీవైఈఓ ప్రభాకరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయం సాధించాలనే లక్ష్యంతో ప్రతి క్రీడాకారుడు బరిలో దిగుతారని, కానీ ఒక్కరే విజేతగా నిలుస్తారని చెప్పారు. గెలుపోటములను సమానంగా స్వీకరించడం నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎసీఎఫ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగే ఈ క్రీడాపోటీలకు అన్ని జిల్లాల నుంచి 420 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. మూడురోజులపాటు పోటీలు నిర్వహించి, ప్రతిభావంతులైన 16 మందితో రాష్ట్రజట్టును ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వరరావు, పరిశీలకులు కె.వెంకటేశ్వరరావు, పి.సుబ్బారావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనాలు సీజ్

పెదపాడు : పర్యావరణానికి హాని కలిగించే చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తున్న వాహనాలను పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు మండలంలో కోళ్ల వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న నాలుగు లారీలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి

ఏలూరు టౌన్: పెదపాడు మండలం తాళ్లమూడి గ్రామ సమీపంలోని భారత్ పంజాబీ దాబా వద్ద పెదపాడు పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌పై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. అడ్డు వెళ్లిన హోంగార్డుపైనా దౌర్జన్యానికి పాల్పడ్డారు. హెడ్‌కానిస్టేబుల్ ఏలూరు జీజీహెచ్‌కురాగా వైద్యులు మెడికో లీగల్ కేసు నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ చింతపల్లి కృష్ణ ఈనెల 1వ తేదీ రాత్రి 9 గంటల సమయం నుంచి గస్తీలో ఉన్నారు. అతనితో పాటు హోంగార్డు నాగేశ్వరరావు కూడా విధుల్లో ఉన్నారు. వీరిద్దరు బీట్ నెంబర్–1లో విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తాళ్లమూడి గ్రామ సమీపంలో ఉన్న భారత్ పంజాబీ దాబా వద్ద గొడవ జరుగుతుందని సమాచారం అందడంతో వెళ్లారు. దాబా వద్ద గొడవ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను వారించారు. అర్ధరాత్రి వేళ గొడవ చేయవద్దంటూ హెచ్చరించడంతో ఆ ముగ్గురూ కలిసి హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేశారు. అడ్డువెళ్లిన హోంగార్డు నాగేశ్వరరావును కూడా రాళ్లతో కొట్టారు. ఆ ముగ్గుర్నీ అదుపులోకి తీసుకోవాలని ప్రయత్నించినా కొట్టి పారిపోయారు. వారు తాళ్లమూడికి చెందిన కంభం విజయ్, కంభం అజయ్, కంభం జగదీష్‌గా గుర్తించారు. గాయాలపాలైన హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌సైకిళ్ల చోరీపై కేసు

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిళ్ల చోరీపై కేసులు నమోదు చేసినట్టు హెచ్‌సీ జె.భీమశేఖర్ తెలిపారు. జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎస్ వెంకటేశ్వరరావు తన మోటార్ సైకిల్‌ను సెప్టెంబర్ 30న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు వద్ద పార్కింగ్ చేయగా చోరీకి గురైందని, జంగారెడ్డిగూడెం ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కాకర్ల రాంబాబు తన మోటార్‌సైకిల్‌ను సెప్టెంబర్ 29న జంగారెడ్డిగూడెం భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో పార్క్ చేయగా చోరీకి గురైందని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసులు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

సత్యం, అహింస నేర్పిన జాతిపిత గాంధీ


గాంధీజీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్ : భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనకు మార్గదర్శకులు, ప్రపంచానికి సత్యం, అహింసా మార్గాలను నేర్పిన మహనీయులు మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు ఎస్పీ శివకిషోర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిబ్బందికి ఆయన స్వయంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు గౌరవంగా బాపూజీ అంటూ పిలుచుకునే గాంధీజీ తన జీవితాన్ని సత్యం, అహింస అనే రెండు మూల సూత్రాలపై నిర్మించుకుని, బ్రిటీష్ పాలకుల నుంచి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారని గుర్తుచేశారు. లాల్ బహుదూర్‌శాస్త్రి ప్రజలకు ఎంతో విశిష్టమైన సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అదనపు ఎస్పీ కేఎస్ఎస్ శేఖర్, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం


తణుకు అర్బన్: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, పార్టీ శ్రేణులు


అత్తిలి: బల్లిపాడు ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం


తణుకుటౌన్: లయన్స్ క్లబ్‌లో సీనియర్ లయన్స్ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు అర్బన్: గాంధీ మార్గం అనుసరణీయమని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని మహాత్ముడి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ శాంతియుత పోరాటం ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలనే సుదుద్దేశ్యంతో యావత్ భారతదేశాన్ని ఉద్యమపోరాటంలో చైతన్యంగా నడిపించిన మహానుభావుడు గాంధీజీ అన్నారు. నేటి రాజకీయల్లో హింస, అసత్యాలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయని, తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాద విషయంలో అదే తరహాలో పొరపాటు చేశారని స్పష్టం చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండానే భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఎంపీపీ రుద్రా ధనరాజు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ ఏఎంసీ మాజీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, పైబోయిన ఏసుబాబు, జల్లూరి జగదీష్, బొల్లాడ శ్రీనివాసు, ఎస్వీ జాకబ్‌బాబు, షేక్ బాజీ, పూడి శంకరం, చింతన్న, రంభ నాగేశ్వరరావు, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు.

అత్తిలి: సత్యం, అహింస, సత్యాగ్రహం ఆయుధంగా దేశా స్వాతంత్ర్య సముపార్జనలో కీలకంగా వ్యవహరించిన గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని గ్రామసర్పంచ్ కసిరెడ్డి బాలలక్ష్మీనారాయణ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బీజేపీ గ్రామపార్టీ అధ్యక్షుడు దాసం ఆదినారాయణ ఆర్థిక సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ కాంశ్య విగ్రహాన్ని దాసం రామన్న ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సిహెచ్ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించి మాట్లాడారు. గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, స్థానిక నాయకులు ఆచంట సుబ్బారావు, గారపాటి ధర్మయ్య, గారపాటి బాబ్జి, తోట గణేష్, తదితరులు పాల్గొన్నారు. అత్తిలి గాంధీ బజార్‌లో గల గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, రంభ సూరిబాబు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, పాల్గొన్నారు. అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పార్టీనాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

తణుకు టౌన్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలను తణుకు మండలంలోని వివిధ గ్రామాలు, వివిధ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. తణుకు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎఎస్ఆర్ కోటేశ్వరరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ ఆధ్వర్యంలో తణుకు లయన్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గాంధీజీ బోధించిన అహింసా మార్గం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సీనియర్ లయన్స్ సభ్యులైన మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు, అల్లూరి సూర్యనారాయణరాజులను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి ఎం రవి రిజనాల్డ్, కోశాదికారి చీకటి శ్రీనివాసరావు, లయన్స్ సభ్యులు కడియాల సూర్యనారాయణ, పీవీ రమణ, ఎంఆర్ కోటేశ్వరరావు, గమిని రాజా, ఆకుల వెంకటేశ్వరరావు, నల్లజర్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీజీ జయంతి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం గాంధీజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటాలను గుర్తుచేశారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని గ్రామ గ్రామాన జాతిపిత మహాత్మాగాంధీజీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెదతాడేపల్లిలో సర్పంచ్ పోతుల అన్నవరం, మాధవరం, అప్పారావుపేట, జగన్నాథపురం, నవాబుపాలెం, మారంపల్లి, ఆరుళ్ల, నందమూరు, చినతాడేపల్లి, కృష్ణాయపాలెం, కొమ్ముగూడెం, కొండ్రుప్రోలు తదితర గ్రామాల్లోని సచివాలయాలు, పాఠశాలల్లోనూ జయంతి వేడుకలను జరిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, తమ్మిశెట్టి చుక్కయ్య, తారమట్ల శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శి టి.రవిచంద్ర, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గాంధీ జయంతి సందర్భంగా ఎస్‌బీఐ రీజినల్ బిజినెస్ ఆఫీస్ (ఆర్‌బీఓ ఆర్–వి) ఉద్యోగులచే స్వచ్ఛ భారత్ సేవా కార్యక్రమం బుధవారం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ట్రాఫిక్ పార్కులో స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. పార్కులో పెరిగిన గడ్డి మొక్కలను, చెత్తచెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ మేనేజర్ ఎం.రమేష్ నాయుడు, రూపా సురేష్, ఎస్.రమణ కుమార్, ఆర్‌బీఓ సిబ్బంది పాల్గొన్నారు. మానవత సేవా సంస్థ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని భవిత దివ్యాంగుల పాఠశాల ఆవరణలో అధ్యక్షులు పచ్చ వెంకటేశ్వరరావుచే నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో

స్థానిక సిపాయి పేట భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో యూనియన్ అధ్యక్షులు గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ, శాస్త్రి జయంతులను ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో అధ్యక్షులు బి.హరికుమార్ అధ్యక్షతన జరిగాయి. వీకే వీరారావు, ఎం.అర్జునరావు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం రూరల్: తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్


తాడేపల్లిగూడెం(టీఓసీ): మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీ జయంతి

గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత


తణుకులో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గీత కార్మికులు

తణుకు: కల్లుగీత కార్మికుల పాలసీను రాష్ట్రప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం తణుకులో నిరసన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ ప్రతి ఏటా అక్టోబరులో కల్లుగీత పాలసీను ప్రభుత్వం ప్రకటించేదని అయితే ప్రస్తుతం ప్రభుత్వం మాత్రం లిక్కర్ పాలసీను ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో సుమారు మూడు లక్షల మంది కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కల్లును ఆధునికీకరించి శీతల పానీయంగా గుర్తించాలని, గీత కార్మిక ఆర్థిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ చేశారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు గుబ్బల వీరరాఘవులు, బుర్రా సత్యనారాయణ, కట్టా వెంకటేశ్వరావు, బాగం శ్రీరాములు, పాలా సత్యనారాయణ, కాసాని శ్రీను, చిట్టూరి ఆదినారాయణ తదితరులు ఆధ్వర్యం వహించారు.

దళిత ఐక్యవేదిక కన్వీనర్‌గా సురేష్, కార్యదర్శిగా రాజేష్


పొట్ల సురేష్


పెనుమాల రాజేష్

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గ దళిత ఐక్యవేదిక కన్వీనర్స్‌గా న్యాయవాది పొట్ల సురేష్, కార్యదర్శిగా పెనుమాల రాజేష్‌కుమార్‌లను నియమించారు. బుధవారం తణుకు అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు సురేష్ తెలిపారు. దళితులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో తణుకు నియోజకవర్గంలో దళితులంతా ఏకంకావాలని, రానున్న రోజుల్లో దళిత ఐక్యవేదిక మండల కమిటీలు, గ్రామ కమిటీలు ఏర్పాటుచేసి దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సురేష్ సూచించారు. దళిత నాయకుడు జి.మధు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో గొల్లపల్లి అంబేడ్కర్, కొండే నాగేశ్వరరావు, వెంకట్రావు, ఎలమంచిలి బాలు, కాకి రాముడు, నక్క రమేష్, కోటి, సుదీర్, జంగం ఆనంద్‌కుమార్, పాల్గొన్నారు.

సబ్‌జైలులో రిమాండ్ ముద్దాయిలకు పండ్లు పంపిణీ

తణుకు అర్బన్: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం తణుకు పట్టణానికి చెందిన మహిళలు సబ్‌జైలులో రిమాండ్ ముద్దాయిలుగా ఉన్న వారికి పండ్లు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్ అందచేశారు. తణుకుకు చెందిన కొలగాని కృష్ణవేణి ఆధ్వర్యంలో మహిళలంతా కలిసి ముద్దాయిలకు ఈ సాయాన్ని అందచేసినట్లు జైలు సూపరింటెండెంట్ మోహనరావు తెలిపారు. మహిళలు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.

క్లుప్తంగా

సంగీత కళాకారిణికి సత్కారం


సంగీత కళాకారిణిని సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంగీతంలో ఎంఏ పట్టా పొందిన అభయం లియోక్లబ్ సభ్యురాలు లియో చిక్కాల సుస్మితని బుధవారం లయన్స్‌క్లబ్ డైమండ్స్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. మహిళా విభాగంచే లాల్ బహదూర్ శాస్త్రి, గాంధీ జయంతిలను ఘనంగా నిర్వహించారు. కె.సుభద్ర, రమాకుమారి, సుశీల, కళ్యాణి, రామలక్ష్మి, కావ్య, మాధురి, రేణుక, నందిని, సాయిశ్రుతి తదితరులు పాల్గొన్నారు.

95 మందికి రక్త పరీక్షలు


లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గరికిపాటి బాపయ్య శర్మ ఆర్థిక సహకారంతో కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఉచిత రక్త పరీక్ష శిబిరం జరిగింది. ఆర్యవైశ్య నాయకులు గమిని సుబ్బారావు శిబిరాన్ని ప్రారంభించారు. 95 మందికి రక్త పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సుంకర శ్రీనివాస్, చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, వంగపండు రామ మోహన్‌రావు, జీడిగుంట హరిబాబు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, గ్రంధి సత్యనారాయణ పాల్గొన్నారు.

మానవుడు ఆధ్యాత్మిక బాంధవ్యం అలవర్చుకోవాలి

అత్తిలి: మానవుడు ఆధ్యాత్మిక బాంధవ్యం అలవర్చుకోవాలని శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అత్తిలి ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జ్ఞాన చైతన్య సదస్సులో ఆయన అనుగ్రహ భాషణ చేశారు. వృద్ధాప్యంలోకి వచ్చిన తరువాత వారికి సరైన రక్షణ ఏర్పాట్లు చేసి, వారిని సంతోష పరచాలని అన్నారు. ఈసందర్భంగా 54 మంది వృద్ధులకు ఉమర్ ఆలీషా శాలువా కప్పి సత్కరించారు. నా మొక్క–నా శ్వాస కార్యక్రమంలో భాగంగా పీఠం సభ్యులకు మొక్కలను అందజేసారు. కార్యక్రమంలో స్థానిక పీఠం కన్వీనర్ నందం తాతయ్య, దాడి పాపాయమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ వార్షికోత్సవం


వాకర్స్ వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పట్టణంలో వాకర్స్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వాకర్స్ గ్రౌండ్‌లో జరిగిన వివిధ ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత ఉదయం గాంధీ జయంతిని నిర్వహించారు. పడాలలో వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు వి.మురళీమోహన్‌రావు, వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కూచిపూడి వెంకట కృష్ణారావు, డాక్టర్ తానేటి శ్రీనివాసరావు, అధ్యక్షులు దూలం నాగరాజు, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సారధి, అనిల్ కుమార్, రాజేంద్ర, వెంకటాచలం, ప్రవా శ్రీనివాస్, బాకా వెంకటేశ్వరరావు, వనచర్ల విజయలక్ష్మి, కె.కనకదుర్గ, సీహెచ్ ఇందిరా కుమారి, వనచర్ల నాగేంద్ర, నూకరాజు, కోపల్లె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో బుధవారం యుగ శక్తి వారిచే ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ఒకేషనల్ కోర్సులపై అవగాహన జరిగింది. పాఠశాల హెచ్ఎం సత్యనారాయణచే విద్యార్థినీ, విద్యార్థులకు కావాల్సిన నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, శివప్రసాద్ విద్యార్థులకు తగు సూచనలు చేశారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో ఏపీటీఎఫ్ పాత్ర ఘనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉపాధ్యాయ ఉద్యమంలో ఏపీటీఎఫ్ పాత్ర ఘనమైనదని రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ఏపీ టీచర్స్ ఫెడరేషన్ కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు ఉద్యమ అధ్యాయన తరగతులు జరిగాయి.

పేదలకు దుప్పట్ల పంపిణీ


తణుకులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు


అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఆయన తనయులు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్‌కుమార్‌ల పుట్టిన రోజు వేడుకలు బుధవారం తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, సంధ్యాజ్యోతి వృద్ధ జనాశ్రమంలో వృద్ధులకు భోజన సౌకర్యం కల్పించారు. ముందుగా పార్టీ కార్యాలయం వద్ద కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో మాజీ మంత్రి కారుమూరి రాజకీయంగా ఎన్నో మంచి పనులు చేసి తణుకు ప్రాంతాన్ని అభివృద్ధిపథంలో నడిపించారని అన్నారు. అంతేకాకుండా కారుమూరి సేవా సమితి ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే కాకుండా పేదలకు ఆర్థికసాయం, సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఘనత కారుమూరికే దక్కుతుందని అన్నారు. ఎంపీపీ రుద్రా ధనరాజు, మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షులు జంగం ఆనంద్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మాజీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నాయకులు మారిశెట్టి శేషగిరి, రాంబాబు, షేక్ జిలానీ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కారుమూరి పుట్టిన రోజు వేడుకలు

అత్తిలి: మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఆయన తనయుడు కారుమూరి సునీల్ కుమార్ పుట్టిన రోజు వేడుకను బుధవారం అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించారు. కేకును కట్‌చేసి, కారుమూరి నాగేశ్వరరావు, సునీల్ కుమార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాంధీ జయంతి వేడుకలను పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకరనాగేశ్వరరావు, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, పోలినాటి చంద్రరావు పాల్గొన్నారు.

తణుకులో క్షీణించిన పారిశుద్ధ్యం



సజ్జాపురం ముత్యాలమ్మవారి వీధిలో పేరుకుపోయిన చెత్త

తణుకు: పట్టణంలో పారిశుద్ధ్యం క్షీణించింది. గత కొద్ది రోజులుగా పారిశుద్ధ్యం సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతో రోడ్లపై ఎక్కడికక్కడే చెత్త పోరుకుపోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. సాధారణంగా పట్టణంలోని వీధుల్లో సేకరించిన చెత్తను వీధి చివర కుప్పలుగా పోస్తుంటారు. నిత్యం ఉదయం ట్రాక్టర్‌పై వచ్చిన సిబ్బంది చెత్తను తొలగిస్తుంటారు. మరోవైపు ఇళ్లలో సేకరించిన చెత్తను సైతం కొన్ని ప్రాంతాల్లో తీసికెళ్లకపోవడంతో అపార్టుమెంట్లు, నివాసాల వద్ద రోడ్డుపైనే చెత్తను పోగులుగా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చెత్తలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పశువులు, కుక్కలు అక్కడకు చేరి మరింత అధ్వానంగా తయారు చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చెత్త కుండీలను తొలగించి మిగిలిన ప్రాంతాల్లో వాటిని దశలవారీగా తొలగించాలని అధికారులు భావించారు. చెత్త కుండీలు సైతం నిండిపోవడంతో ఆయా ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి క్రమం తప్పకుండా చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి

అత్తిలి: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ బుధవార కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను మర్యాద పూర్వకంగా కలిసారు. బీసీసీఐ గౌరవ కార్యదర్శి జైషా దివ్యాంగుల క్రికెట్ అభివృద్ధికి చేస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కేశినేని చిన్ని, గౌరవ కార్యదర్శి సానా సతీష్‌బాబు దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారులకు సదుపాయాలు కల్పించి ముందుకు నడిపిస్తున్నట్లు మంత్రికి చెప్పారు. దివ్యాంగుల క్రీడాకారులకు సదుపాయాలు కల్పించి, వారిని క్రీడల్లో మరింత నైపుణ్యం పెంపొందించేలా ఏర్పాట్లు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు వేళాయే..


దసరా ఉత్సవాలకు ముస్తాబైన దువ్వ దానేశ్వరి అమ్మవారి ఆలయం


తణుకులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం

ముస్తాబైన మండపాలు

తణుకు టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాలకు సమయం సమయం ఆసన్నమైంది. ఈనెల 3నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే మండపాలను సుందరంగా ముస్తాబు చేశారు. మండలంలోని వివిధ అమ్మవార్ల ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి ఆలయం, మండపాకలోని యల్లారమ్మ ఆలయం, వేల్పూరులోని ఈశ్వరమ్మ ఆలయం, తణుకు పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలతోపాటు మరికొన్ని ఆలయాలను దసరా ఉత్సవాల కోసం ప్రత్యేకంగా అలకరించారు. ఈసందర్భంగా ఆలయాలలోజరిగే పూజాకార్యక్రమాలకోసం భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులను కమిటీలు ఏర్పాటు చేశాయి. అలాగే భవానీ మాలధారణలు, మండల దీక్షలు, అర్ధమండల దీక్షలు కూడా ప్రారంభం కానున్నాయి. భక్తులు కుంకుమ పూజలు చేసుకోవడానికి అనుకూలంగా మండపాలను ఏర్పాటుచేశారు.


దసరా ఉత్సవాలకు ముస్తాబైన వేల్పూరులోని ఈశ్వరమ్మ ఆలయ ప్రాంగణం


పెంటపాడు: వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ లైట్లు

ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

పెంటపాడు: మండలంలో ఈనెల 3 నుంచి దసరాశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రత్తిపాడు వై. జంక్షన్ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో చలువ పందిళ్లు వేసి విద్యుత్ లైట్లు అమర్చారు. ఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో ప్రసిద్ధిగాంచిన స్వయంభువుగా వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేసారు. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామివారి ఆలయం, కె.పెంటపాడులోని బైరాగిమఠం, బోడపాడులోని రామలింగేశ్వరస్వామివారి ఆలయం, పెంటపాడులోని పార్వతి రామలింగేశ్వరస్వామివారి ఆలయం, చిన్న శివాలయం, మౌంజీపాడులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం, మీనవల్లూరులోని దేవీసెంటర్‌లో కనకదుర్గాదేవి ఆలయం, విప్పర్రు, జట్లపాలెం, ఉమామహేశ్వరం, చింతపల్లి తదితర గ్రామాలలో దసరా ఉత్సవాలు చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.